# పల్లెలకు అభివృద్ధి నిధులు

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేక్


భీమారం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

**భీమారం:** చెన్నూర్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. భీమారం మండల కేంద్రంలో రూ.70లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లు, సీసీ రోడ్ల అభివృద్ధి చేసి డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పేదల సంక్షేమం మరిచిందని, ఇప్పుడు గ్రామాల్లోని సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఎక్కువ నిధులు తెస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**డ్రెయినేజీలు నిర్మించాలని వినతి..**

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పూర్తి స్థాయిలో డ్రెయినేజీలు నిర్మించి, దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలని స్థానిక దళితులతో పాటు గిరిజనులు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఆయన అంగీకరించారు. మండల కేంద్రంలో మండల సమాఖ్య భవనం నిర్మించాలని ఐకేపీ మహిళలు వినతిపత్రం అందజేశారు. అయన వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ నాయక్, కొత్త సత్తిరెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని వినతి**

**భీమారం:** వివిధ షాపుల యజమానులు ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాలు ఏర్పాటు చేసి కిరాయిలకు ఇస్తున్నారని, దీంతో తాము ఆటోలు పెట్టుకునేందుకు స్థలం లేకుండా పోయిందని వాపోయారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని ఆటోడ్రైవర్లు ఎమ్మెల్యే వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

**గ్రామాల్లో పర్యటన**

**జైపూర్:** గ్రామాల్లో సమస్యల పరిష్కారం దిశగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి శనివారం గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు వింటూ వినతులు స్వీకరించారు. కుందారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. వేలాల మల్లన్నస్వామి ఆలయంలో మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, జిల్లా నాయకులు సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

**జైపూర్:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చినూరి సత్యం తండ్రి చినూరి లింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంతో పాటు వెంకట్రావుపల్లి, మిట్టపల్లికి చెందిన పలువురు బాధితులకు సీఎంఆర్ చెక్కులను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అందజేశారు.

## మందమర్రిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'

- 54 ద్విచక్రవాహనాలు, 6 ఆటోలు స్వాధీనం


మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

**మందమర్రిరూరల్:** మందమర్రి పట్టణంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలో సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం 'కమ్యూనిటీ కాంటాక్ట్' నిర్వహించారు. పోలీసులు కాలనీలో ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పాల్గొని మాట్లాడారు. ధృవపత్రాలు లేని 54ద్విచక్రవాహనాలతో పాటు 6ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారమివ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు ఏమైనా జరుగుతున్నాయా..? ఎవరైనా ఇతర ప్రాంతాల్లో నేరాలు చేసి ఇక్కడేమైనా షల్టర్ తీసుకుంటున్నారా..? అనే తదితర విషయాలపై కాలనీ ప్రజలు ఎప్పటికప్పుడు పోలీసులకు తెలపాలన్నారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి ధృవపత్రాలు చూపించి, వాహనాలు తీసుకెళ్లాలని తెలిపారు. మహిళలు, చిన్నారులపై ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలపై, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, దేవపూర్ ఎస్సై ఆంజనేయులు, ఆర్ఎస్సై వెంకన్న, సర్కిల్ పరిధిలోని స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం'


నివాళులర్పిస్తున్న నాయకపోడు నాయకులు

**పాతమంచిర్యాల:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలలో గోండు తెగలో కలుపకుండా, నాయకపోడు తెగకు ప్రత్యేక కేటగిరి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంట సత్యం, నాయకులు గంజి లక్ష్మణ్, ఈద నరేష్, మారినేని రాజేశ్వరీ, మేసినేని రాజన్న పాల్గొన్నారు.

### నియామకం


మహేశ్ నాయక్

**చెన్నూర్‌రూరల్:** షెడ్యూల్డ్ తెగల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా చెన్నూర్ మండలంలోని లంబడిపల్లి గ్రామానికి చెందిన నగావత్ మహేశ్ నాయక్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు సునావత్ దేవదాసు నాయక్ తెలిపారు.

### ఆదిలాబాద్ మున్సిపల్ ఏవోగా హాజీపూర్ వాసీ


సీఎం, సీఎస్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రాజ్‌కుమార్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** అకౌంట్స్ ఆఫీసర్(జేఏఓ) ఫలి తాల్లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బట్టల రాజ్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించగా ఎట్టకేలకు ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని అకౌంట్స్ విభాగంలో అకౌంట్ అధికారి(ఏఓ)గా పోస్టింగ్ లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

## ప్రాణహిత ముంపు రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**చెన్నూర్:** ప్రాణహిత ముంపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్ మండలాల్లోని ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లోని వేలాది ఎకరాల పంటలు వరద ముంపునకు గురయ్యాయని తెలిపారు. నాలుగేళ్లుగా పంటలు ముంపునకు గురై రైతులు నష్టపోతున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెన్నూర్ ఏరియా సీపీఎం నాయకులు రాతిపల్లి నగేశ్, సిడాం సమ్మక్క, సామల ఉమారాణి, కుందారపు చంద్రన్న, సత్యం పాల్గొన్నారు.

## అమ్మవారికి బోనం


బోనాలతో గ్రామస్తులు

**మందమర్రిరూరల్:** మందమర్రి పట్టణంలోని పాత కేకే-1 సీఎస్పీ సమీపంలో గల శ్రీ దుర్గాభవాని మాత అమ్మవారికి శనివారం బోనాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నర్సింగ్ భవాని ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ

**మంచిర్యాలక్రైం:** నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ పెరగనుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ పని చేస్తుందన్నారు. గుర్తించిన హాట్ స్పాట్ ప్రాంతాల్లో షీ టీమ్ పోలీసులు మఫ్టీలో ఉంటూ నిఘా పెట్టనున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో రెండు షీ టీమ్ బృందాలు తిరుగుతున్నాయన్నారు. విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గత నెలలో 114డెకాయ్ ఆపరేషన్స్, 28 అవగాహన సదస్సులు, 235హాట్ స్పాట్స్ విజిట్ చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లచ్చన్న మృతి


లచ్చన్న (ఫైల్)

**మంచిర్యాలక్రైం:** స్థానిక ఎల్లవాడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దాసరి లచ్చన్న శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎల్లవాడ మున్సిపల్ కౌన్సిలర్‌గా 2005 నుంచి 2010 వరకు పని చేశాడు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్ సుధమల్ల హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు తుముల నరేష్, చిట్ల సత్యనారాయణ, తదితరులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

### సంక్షిప్త వార్తలు

**'పారిశుధ్యపనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'**

**భీమారం:** పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం గ్రామపంచాయతీ ద్వారా చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**'చెడు అలవాట్లకు ఆకర్శితులు కావొద్దు'**

**తాండూర్/భీమిని/శ్రీరాంపూర్ :** విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్శితులు కావొద్దని మత్తుపదార్థాలు, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, యాంటీ ర్యాంగింగ్‌పై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. తాండూర్ మండలంలోని రేచినీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాండూర్ సీఐ కుమారస్వామి, కన్నెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్సై గంగారాం అవగాహన కల్పించారు. శ్రీరాంపూర్ ఆర్కే 6 కొత్తరోడ్‌లో ఎస్సై సంతోశ్ చట్టాలపై కళాబృందంతో అవగాహన కల్పించారు.

## రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

**మందమర్రిరూరల్:** సింగరేణి ఏరియాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయించాలని కోరుతూ సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ శనివారం హైదరాబాద్‌లోని సీఎండీ ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు. సీఎండీ సానుకూలంగా స్పందించి, అన్ని ఏరియాల్లో శిబిరాల ఏర్పాటుకు సహకరిస్తానని చెప్పినట్లు తెలిపారు. ఆయన వెంట తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్ ఉన్నారు.

## కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు


చెన్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**జన్నారం/చెన్నూర్‌రూరల్/చెన్నూర్/మంచిర్యాల టౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్):** జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో, సాయినగర్, ముస్లింబస్తీ 1, ఏసీసీ 3, దొరగారిపల్లె 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో, జన్నారం మండలం పొనకల్, రేండ్లగూడలోని అంగన్‌వాడీ సెంటర్లలో, చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో, హాజీపూర్ మండలం పెద్దంపేట అంగన్‌వాడీ కేంద్రంలో, చెన్నూర్ పట్టణంలోని విశ్వకర్మ కాలనీ, బొక్కలగూడెం కాలనీల్లో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాలు పుట్టినబిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు, గర్భిణులకు వివరించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేశారు. జిల్లా కేంద్రంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వేదవ్యాస్, లయన్స్‌క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూదన్ రెడ్డి, అధ్యక్షుడు బాల మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. జన్నారంలో ఎంపీడీవో శశికళ, సూపర్‌వైజర్లు రమాదేవి, పద్మ, ఎంపీవో జలందర్, ఈవో రాహుల్, హాజీపూర్‌లో సీడీపీవో విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రూపాదేవి, పోషణ్ అభిమాన్ అధికారి సతీశ్, వసుంధర, నాగలక్ష్మి, చెన్నూర్‌లో టీచర్లు స్రవంతి, మణి, సూపర్‌వైజర్ సువర్ణ, ఏఎన్ఎం సుధ, ఆశ వర్కర్లు లలిత, స్వప్న పాల్గొన్నారు.

## 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై సమీక్ష


రామకృష్ణాపూర్: మాట్లాడుతున్న కమిషనర్


బెల్లంపల్లి: మాట్లాడుతున్న చైర్‌పర్సన్

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ నెల 5నుంచి 9వరకు ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఐదు రోజుల్లో పరిసరాల పరిశుభ్రతపై వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా నీటి నిల్వలు లేకుండా నీరు నిలిచిన చోట గుంతలను పూడ్చటం, వీధి కుక్కల నిర్మూలనపై దృష్టిసారించటం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా స్థలాలను శుభ్రం చేయటం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, డాక్టర్ మానస, సీడీపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**5–9 తేదీల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం**

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీలో ఈ నెల 5–9 తేదీల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి వార్డులోనూ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి మున్సిపల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ చిట్టిబాబు, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, టీఎంసీ దుర్గయ్య, పర్యావరణ ఇంజనీర్ సంతోష్ పాల్గొన్నారు.

**వేమనపల్లి:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన స్వచ్ఛదనం...పచ్చదనంపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆగస్టు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, అదనపు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అక్రమంగా వేసిన టేలాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

**మంచిర్యాలటౌన్:** గత నెల 14వ తేదీన 'స్థలం బల్దియాది... సొమ్ము ప్రైవేటు వ్యక్తులకు' అనే శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి మంచిర్యాల మున్సిపల్ అధికారులు స్పందించారు. అక్రమంగా మున్సిపల్ స్థలాల్లో వేసిన టేలాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పలుమార్లు ఆయా టేలాల్లో ఉంటున్న వారికి చెప్పారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో శనివారం బస్టాండ్ పక్కన జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముందు వేసిన టేలాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచే తొలగింపును చేపట్టగా, కొందరు వ్యాపారస్తులు కూల్చివేతను అడ్డుకుని ఆందోళన చేశారు. తమకు నోటీసులు ఇవ్వకుండా టేలాలను ఎలా తొలగిస్తారంటూ మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ.. మున్సిపల్ స్థలంలో అక్రమంగా వేసిన టేలాలకు నోటీసులు ఇవ్వరని, గత పదిహేను రోజులుగా స్వచ్ఛందంగా టేలాలను తొలగించుకోవాలని సూచిస్తున్నా, స్పందించకపోవడంతోనే ఆ టేలాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామని, అక్రమంగా వేసిన టేలాలన్నింటినీ తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ తెలిపారు. కొందరు టేలాలను తొలగించేందుకు కొద్ది రోజుల సమయం ఇవ్వాలని అడిగినా, అధికారులు మాత్రం అక్రమంగా వేసిన 16టేలాలను పూర్తిగా తొలగిస్తామని వ్యాపారులకు తెలిపారు.

## మహిళలపై వివక్షను వ్యతిరేకించాలి



అభివాదం చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకురాళ్లు

**శ్రీరాంపూర్:** కంప్యూటర్ యుగంలో కూడా మహిళపై వివక్ష చూపుతున్నారని, దీన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.జ్యోతి తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన మహిళా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ మతాల్లో కట్టుబాట్లు, సంప్రదాయాల పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించినా, ఇప్పటికీ వాటిని అమలు చేయడం లేదన్నారు. మహిళలంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని, రాజ్యాంగంలో కల్పించిన సదుపాయాలు పొందాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి డీ. అరుణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు డీ.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ..**

డివిజన్ అధ్యక్షురాలిగా మంగ, ఉపాధ్యక్షురాలిగా మహేశ్వరీ, లలిత, ప్రధాన కార్యదర్శి అనిత, సహాయ కార్యదర్శి మీనా, శ్యామల, కోశాధికారిగా రాజకళతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

### పవర్ ప్లాంట్ జీఎంగా రాజశేఖర్‌రావు

**జైపూర్:** జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జీఎం(ఈఅండ్ఎం)గా ఎస్.వీ రాజశేఖర్‌రావును నియమిస్తూ శనివారం సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ సింగరేణి ప్రధాన కార్యాలయంలో మార్కెటింగ్ అండ్ మూవ్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ జీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాజశేఖర్ రావు జీఎంగా ఎస్టీపీపీకి పదోన్నతిపై వస్తున్నారు.

## క్లుప్తంగా

### పాఠశాలలో బోనాల ఉత్సవం


పోతురాజు వేషధారణలో విద్యార్థులు

**రామకృష్ణాపూర్:** పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో శనివారం బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కొందరు సంప్రదాయ దుస్తుల్లో, మరికొందరు పోతురాజు వేషధారణలో విచ్చేసి ఆకట్టుకున్నారు. పలువురు వక్తలు విద్యార్థులకు బోనాల పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్‌అజీజ్, ప్రిన్సిపల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### విరిగిపడిన చెట్లు.. విద్యుత్ సరఫరాలో అంతరాయం


తీగలపై నుంచి కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

**జన్నారం:** మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురువడంతో మండలంలోని తపాలపూర్, మహ్మదాబాద్ గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారి ఇరువైపుల చెట్లు విరిగిపడ్డాయి. కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది శనివారం ఉదయం పరిశీలించి కొమ్మలను తొలగించారు.

### కార్గిల్ మెమోరియల్‌ను సందర్శించిన రఘునాథ్


నివాళులర్పిస్తున్న రఘునాథ్

**మంచిర్యాలటౌన్:** బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి శనివారం ద్రాస్(కాశ్మీర్)లో కార్గిల్ వార్ మెమోరియల్‌ను సందర్శించారు. కార్గిల్ యుద్ధంలో వీర మరణం చెందిన వీరజవాన్లకు నివాళులు అర్పించారు.

### 5న ప్రజాభిప్రాయ సేకరణ

**లక్సెట్టిపేట:** మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 5వ తేదీన జాతీయ రహదారి నిర్మాణ పనులపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. 63వ జాతీయ రహదారి నిర్మాణంపై భూ నిర్వాసితులు, వివిధ అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు, నిర్వాసితులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### నేడు సీపీఐ మండల కౌన్సిల్ సభ

**శ్రీరాంపూర్:** సీపీఐ పార్టీ నస్పూర్ మండల కౌన్సిల్ సభ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి కే. మహేశ్, నాయకులు చిలుక రమేశ్, మొగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో ఈ సభ జరుగుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

### రేచిని కార్యదర్శిపై డీపీవోకు ఫిర్యాదు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచిని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై శనివారం మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వెంకటేశ్వర్‌రావుకు రేచిని గ్రామానికి చెందిన రమాదేవి ఫిర్యాదు చేసింది. తన ఇంటి ముందు వాహనం వెళ్లేలా నిర్మించుకున్న ర్యాంపు విషయంలో అనుమతులు లేవని కార్యదర్శి వేధిస్తున్నట్లు వాపోయారు. డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరింపులు తాళలేక రెండు విడతల్లో మొత్తం రూ.20వేలు ముట్టజెప్పినట్లు తెలిపారు. అయితే ఇటీవల అదనంగా మరో రూ.10వేలు డిమాండ్ చేస్తున్నాడని, అలాగే డబ్బులు ఇచ్చినట్లు ఎవరికైనా చెబితే క్రిమినల్ కేసు బుక్ చేపిస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. కార్యదర్శి కావాలని తమను వ్యక్తిగతంగా బెదిరింపులకు గురిచేస్తున్నాడని, దీంతో చేసేది లేక కార్యదర్శి శ్రీనివాస్‌పై డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు రమాదేవి తెలిపారు.